క్లుప్తంగా

బోర్లకు మరమ్మతులు

నందిగామటౌన్: పట్టణంలో పనిచేయని బోర్లకు యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేపడుతున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ మండవ కృష్ణకుమారి తెలిపారు. పట్టణంలోని మూడవ వార్డులో బోరుపంపునకు చేపట్టిన మరమ్మతు పనులను గురువారం ఆమె పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా తగిన చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. ఆమె వెంట టీడీపీ నాయకులు, మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.

226 మందికి కంటి పరీక్షలు



బూదవాడ(జగ్గయ్యపేట): గ్రామంలోని సచివాలయంలో రామ్‌కో సిమెంట్స్ లిమిటెడ్ ఆధ్వర్యంలో గురువారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా రామ్‌కో వైద్యుడు రాజా కేశవప్రసాద్, వైద్య సిబ్బంది పాల్గొని 226 మందికి కంటి పరీక్షలు చేసి కళ్లజోళ్లు పంపిణీ చేశారు.

వెంకటేశ్వరుని ఆదాయం రూ. 30.33 లక్షలు

తిరుమలగిరి(జగ్గయ్యపేట): గ్రామంలో వేంచేసియున్న వాల్మీకోద్భవ వెంకటేశ్వర స్వామివారికి హుండీ కానుకల ద్వారా రూ.30.33లక్షల ఆదాయం వచ్చినట్లు ఆలయ ఏసీ వరప్రసాద్ తెలిపారు. స్థానిక ఆలయ ప్రాంగణంలో గురువారం హుండీని లెక్కించారు. కొండపై శివాలయం, అన్నదానం హుండీతో కలిపి పైఆదాయం వచ్చినట్లు ఏసీ వివరించారు. హుండీ లెక్కింపులో ఆలయ చైర్మన్ భరద్వాజ్, నందిగామ ఆలయాల ఇన్‌స్పెక్టర్ పవన్‌కళ్యాణ్, భక్తులు పాల్గొన్నారు.

వీఆర్వోలు అందుబాటులో ఉండాలి

వీరులపాడు: రైతుల భూములకు సంబంధించిన సమస్యల పరిష్కారానికి వీఆర్వోలు తగిన చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ హుస్సేన్ ఆదేశించారు. జుజ్జూరులోని తన కార్యాలయంలో గురువారం ఆయన మండలంలోని వీఆర్వోలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వీఆర్వోలు ఆయా గ్రామాల్లో ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండాలన్నారు. విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో వీఆర్వోలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

నవోదయ పరీక్షల్లో ప్రతిభ చూపిన రేవన్



కంచికచర్ల : మండలంలోని కునికెనపాడు ఎంపీపీ స్కూల్‌లో ఐదోతరగతి చదువుతున్న కొమరవల్లి రేవన్ ఇటీవల నిర్వహించిన జవహర్ నవోదయ ప్రవేశ పరీక్షలో అత్యుత్తమ మార్కులు సాధించినట్లు హెచ్ఎం నంద్రు సురేష్‌బాబు గురువారం తెలిపారు. ఈ పరీక్షల్లో రేవన్ విశేష ప్రతిభను కనబరిచి 100కి 95 మార్కులు సాధించినట్లు వివరించారు. రేవన్ తండ్రి సూర్యప్రకాష్ పాస్టర్‌గా పనిచేస్తుండగ, తల్లి గృహిణి. ప్రతిభచూపిన రేవన్‌ను పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

పోక్సో చట్టంపై అవగాహన పెంచుకోండి

సీబీఐ స్పెషల్ కోర్టు జడ్జి కేఎస్ రామకృష్ణ

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): పోక్సో చట్టంపై విద్యార్థులకు అవగాహన కలిగి ఉండాలని సీబీఐ స్పెషల్ కోర్టు జడ్జి కె.ఎస్.రామకృష్ణ అన్నారు. స్థానిక మొగల్రాజపురంలోని రత్నమాంబ వీధిలోని మాస్టర్ మైండ్స్ కళాశాల ఆవరణలో మండల న్యాయ సేవ అధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు గురువారం సాయంత్రం జరిగింది. రామకృష్ణ మాట్లాడుతూ.. బాలిక పట్ల బాలురు అనుచితంగా ప్రవర్తిస్తే పోక్సో చట్టం కింద కేసు నమోదవుతుందన్నారు. ఈ చట్టం కింద కేసు నమోదు అయితే యువత భవిష్యత్తు నాశనం అవుతుందని చెప్పారు. విద్యార్థినులు గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కలిగి ఉండాలన్నారు. మైనర్లపై పోక్సో చట్టం కింద కేసు నమోదు అయితే వారికి జువైనల్ హోమ్‌కు పంపుతారని చెప్పారు. జీవితంలో కళాశాలలో చదివే రోజులు చాలా సంతోషంగా ఉంటాయని, చక్కగా చదువుకుని ఉజ్వల భవిష్యత్తును సొంతం చేసుకోవాలని చెప్పారు. పోక్సో చట్టం ప్రకారం బాలిక తల్లిదండ్రులు ఇచ్చే ఫిర్యాదుకు చట్ట ప్రకారం చాలా పటిష్టంగా ఉంటుందని చెప్పారు. పోక్సో చట్టంలోని అంశాలపై అవగాహన పెంచాలనే ఉద్దేశంతో కళాశాలకు వెళ్లి ఈ చట్టంపై అవగాహనా సదస్సులు నిర్వహిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో స్పెషల్ పీపీ కె.కల్యాణ్ చక్రవరి, కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, న్యాయవాదులు డి.ఆంజనేయ ప్రసాద్, రంగయ్య, ఎస్.నాగప్రసాద్, కోర్టు సూపరింటెండెంట్ నాంచారయ్య, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. సదస్సు అనంతరం విద్యార్థుల సందేహాలను రామకృష్ణ నివృత్తి చేశారు.

పట్టు నిలుపుకొన్న వైఎస్సార్ సీపీ

- కూటమి నేతల ప్రలోభాల వల..
- పట్టించుకోని ఎంపీటీసీలు
- ఐక్యత చాటిన గ్రామీణ నేతలు
- ఏకగ్రీవంగా ఎంపీపీ ఎన్నిక
- వైఎస్సార్ సీపీకే దక్కిన పీఠం
- ఎంపీటీసీ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపిన ఎమ్మెల్సీ మొండితోక అరుణకుమార్



వైఎస్సార్ సీపీ ఎంపీటీసీలు, నాయకులతో ఎమ్మెల్సీ మొండితోక అరుణకుమార్, మాజీఎమ్మెల్యే మొండితోక జగన్‌మోహనరావు



నందిగామ నూతన ఎంపీపీ రమాదేవితో ప్రమాణస్వీకారం చేయిస్తున్న పీఓ శ్రీలక్ష్మి

నందిగామరూరల్: నందిగామ మండల పరిషత్ ఎన్నికల్లో ఎంపీపీ పదవిని మరోసారి గెలుచుకోవడం ద్వారా మండలంలో తనపట్టును వైఎస్సార్ సీపీ మరోసారి నిరూపించుకుంది. నందిగామ మున్సిపల్ చైర్మన్ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి చెందిన పలువురు కౌన్సిలర్లను ప్రలోభపెట్టడం ద్వారా చైర్మన్ గిరిని సొంతం చేసుకున్న కూటమి నేతలు, ఈసారి కూడా అదేపంథాను అనుసరించేందుకు యత్నించినప్పటికీ ఎంపీటీసీలు, గ్రామీణ ప్రాంత నేతలు వారి కుట్రలను తిప్పికొట్టారు. ఎంపీపీ పదవిని ఏకగ్రీవంగా గెలుచుకోవడం ద్వారా ఐక్యతను చాటి, నందిగామ రాజకీయాల్లో వైఎస్సార్ సీపీ పట్టును నిరూపించారు. ఎంపీపీ పదవిని ఎలాగైనా చేజిక్కించుకునేందుకు కూటమి నేతలు చేసిన ప్రలోభాలకు లొంగక వారి ఎత్తుగడలను చిత్తు చేస్తూ, కూటమి కుటిల రాజకీయాలు క్లీన్ చేశారు.

పోటీ నుంచి తప్పుకున్న కూటమి...

ప్రలోభాల వలకు వైఎస్సార్ సీపీ ఎంపీటీసీలు చిక్కకపోవడంతో చేసేదేమి లేక కూటమి నేతలు ఎంపీపీ ఎన్నికల బరి నుంచి తప్పుకున్నారు. మండలంలో మొత్తం 14 ఎంపీటీసీ స్థానాలకు 13స్థానాల్లో వైఎస్సార్ సీపీ తరపున గెలిచిన ఎంపీటీసీలు ఉండగా, టీడీపీ తరపున ఒక్క ఎంపీటీసీనే ఉన్నారు. వైఎస్సార్ సీపీకి చెందిన ఓ ఎంపీటీసీ అన్నం పిచ్చయ్య గతేడాది కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే టీడీపీలో చేరారు. దీంతో కూటమి బలం రెండుకు చేరింది. ఈక్రమంలో ఇటీవల జరిగిన మున్సిపల్ చైర్మన్ ఎన్నిక మాదిరిగానే ఎన్నికల్లోనూ పలువురు వైఎస్సార్ సీపీ ఎంపీటీసీలను కూటమి వైపు తిప్పుకుని ఎంపీపీ పదవిని చేజిక్కించుకునేందుకు కూటమి నేతలు గట్టిగానే పావులు కదిపారు. ఎంపీపీ పదవికి పోటీ చేసేందుకు అర్హత ఉన్న ఎంపీటీసీ సభ్యులు, తగిన సంఖ్యాబలం లేనప్పటికీ ఆపదవిని ఎలాగైనా ఆపదవిని చేజిక్కించుకోవడం ద్వారా కూటమి పెద్దల వద్ద తమ ఇమేజ్‌ను పెంచుకోవచ్చనే ఉద్దేశంతో కూటమి నేతలు అనేక కుయుక్తులు పన్నారు. కాని వైఎస్సార్ సీపీకి చెందిన 12మంది ఎంపీటీసీలు కూటమి నేతల ప్రలోభాలను పట్టించుకోకుండా ఐక్యం ఉండి పార్టీ అభ్యర్థి పెసరమల్లి రమాదేవి ఏకగ్రీవంగా ఎంపీపీగా ఎన్నికయ్యేలా చేసి రాజకీయాల్లో తమ నిజాయితీని చాటుకున్నారు. తద్వారా నందిగామ మండల రాజకీయాల్లో వైఎస్సార్ సీపీ పట్టు ఏమాత్రం సడలలేదని వెలుగెత్తి చాటగా... టీడీపీ తరపున గెలుపొందిన ఎంపీటీసీ, ఆపార్టీలో చేరిన మరో ఎంపీటీసీ సైతం చివరికి ఎంపీపీ ఎన్నిక కార్యక్రమానికి గైర్హాజరు కావడం గమనార్హం.

ఎంపీటీసీలకు కృతజ్ఞతలు : ఎమ్మెల్సీ

కూటమి నేతల కుటిల రాజకీయాలు, ప్రలోభాలకు తలవంచకుండా వైఎస్సార్ సీపీ అభ్యర్థి రమాదేవిని ఎంపీపీగా గెలిపించుకున్నారంటూ ఎంపీటీసీ సభ్యులకు ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణకుమార్, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ జగన్‌మోహనరావు కృతజ్ఞతలు తెలియజేశారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో గురువారం వారు మాట్లాడుతూ ఎంపీటీసీ సభ్యులు వ్యవహరించిన తీరు నేటి రాజకీయనాయకులందరికీ ఆదర్శనీయన్నారు. గెలిచిన పార్టీకి అండగా నిలుస్తాం తప్ప వెన్ను చూపమని గ్రామీణ ప్రాంత నాయకులు మరోసారి నిరూపించుకున్నారని కొనియాడారు. కార్యక్రమంలో నందిగామ వైస్ ఎంపీపీ ఆకుల హనుమంతరావు, మాజీ ఎంపీపీ అరిగెల సుందరమ్మ, ఎంపీటీసీ సభ్యులు కొమ్మినేని శోభారాణి, రామిరెడ్డి సీతయ్య, వేల్పుల రాము, సింగంశెట్టి నాగేశ్వరరావు, గర్మిడి నరసింహారావు, గుగులోతు చిన్నలక్ష్మి, నల్లపు సునీత, జిల్లేపల్లి కమల, అప్పికట్ల సురేష్, మండల నాయకులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షులు వీరే



బండి మల్లికార్జునరావు



వేమా సురేష్‌బాబు



మహ్మద్‌మస్తాన్



మంచాల చంద్రశేఖర్

కంచికచర్ల : వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు నందిగామ నియోజకవర్గంలోని ఆయా మండల పార్టీల అధ్యక్షులను నియమించారు. నందిగామ మండల కన్వీనర్‌గా మంచాల చంద్రశేఖర్, పట్టణ అధ్యక్షుడిగా మహ్మద్ మస్తాన్, కంచికచర్ల మండల కన్వీనర్‌గా బండి మల్లికార్జునరావు, పట్టణ అధ్యక్షుడిగా వేమా సురేష్‌బాబు, వీరులపాడు మండల కన్వీనర్‌గా ఆవుల రమేష్‌బాబు, చందర్లపాడు మండల కన్వీనర్‌గా కందుల నాగేశ్వరరావు నియమితులయ్యారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ తమకు పదవీ బాధ్యతలు అప్పగించిన పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణ్‌కుమార్, మాజీఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. పార్టీ పటిష్టతకు మరింత కృషిచేస్తామని తెలిపారు.

సదరం క్యాంపులో వసతులు కల్పించాలని డిమాండ్



సదరం క్యాంపులో దివ్యాంగుల ఇబ్బందులను తెలుసుకుంటున్న తన్నీరు నాగేశ్వరరావు

జగ్గయ్యపేటఅర్బన్: జగ్గయ్యపేట ప్రభుత్వాస్పత్రిలో నిర్వహిస్తున్న సదరం రీవెరిఫికేషన్ క్యాంపులో దివ్యాంగులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి తన్నీరు నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. స్థానిక ప్రభుత్వాస్పత్రిలో నిర్వహిస్తున్న సదరం రీ వెరిఫికేషన్ క్యాంపును ఆపార్టీ నాయకులతో కలిసి గురువారం ఆయన పరిశీలించారు. పరీక్షలు చేయించుకునేందుకు దూర ప్రాంతాల నుంచి వచ్చిన దివ్యాంగులు, వృద్ధులతో మాట్లాడారు. వారు పడుతున్న ఇబ్బందులను అడిగితెలుసుకున్నారు. సర్వర్ సమస్య కారణంగా ఉదయం 11గంటలకు కూడా క్యాంపు ప్రారంభంకాకపోగా, గంటగంటకు ఎండ తీవ్రత పెరిగిపోతుండటంతో వృద్ధులు, దివ్యాంగులు అవస్థలుపడ్డారు. ఈసందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ సదరం క్యాంపుకు వచ్చిన దివ్యాంగులు, వృద్ధులకు వీల్‌చైర్లు ఏర్పాటుచేయాలని కోరారు. అలాగే పరీక్షలు చేసేందుకు ఒక్క డాక్టరే కాకుండా వైద్యుల సంఖ్య పెంచాలన్నారు. సదరం క్యాంపు ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల లోపు పూర్తయ్యేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ డైరెక్టర్ పింగళి నర్సింహారెడ్డి, లింగగూడెం గ్రామపార్టీ అధ్యక్షుడు బరిగెల నాగరాజు, పట్టణ యూత్ కార్యదర్శి గొట్టిపాళ్ల సురేష్ తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్ వినియోగంపై అవగాహన



బెలూన్‌ను ఎగరవేస్తున్న సీపీ రాజశేఖర్‌బాబు

చిల్లకల్లు(జగ్గయ్యపేట): వాహనదారులకు ప్రతినిత్యం పోలీసులు అవగాహన కల్పించాలని విజయవాడ సీపీ రాజశేఖరబాబు సూచించారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌ను గురువారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ప్రాంతం తెలంగాణకు సరిహద్దుగా ఉండటంతో నిత్యం వేల సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయన్నారు. హెల్మెట్, డ్రంక్ అండ్ డ్రైవ్ తదితర భద్రతా నియమాలపై వాహనదారులకు ఎప్పటికప్పుడు అవగాహన కల్పిస్తుండాలని పోలీసు సిబ్బందికి సూచించారు. ఇసుక, గ్రావెల్, రేషన్ బియ్యం అక్రమ రవాణా నియంత్రణకు పటిష్ట చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం స్టేషన్ సిబ్బంది తయారు చేయించిన నో హెల్మెట్ నో ఎంట్రీ సేవ్‌లైఫ్ కాన్సెప్ట్ బెలూన్‌ను ఎగరవేశారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ ఐపీఎస్ మనీషారెడ్డి, నందిగామ ఏసీపీ తిలక్, సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ తోట సూర్యశ్రీనివాస్, ఏఎస్ఐ మంగ్యానాయక్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

కారు, జీప్ ఢీ కొట్టిన ఘటనపై కౌంటర్ కేసులు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): మహిళలు ప్రయాణిస్తున్న కారును జీప్‌తో అడ్డగించడమే కాకుండీ ఢీ కొట్టిన వ్యక్తిపై కొత్తపేట పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం హైదరాబాద్ ఉప్పల్‌కు చెందిన షేక్.భుసరా(32) కొత్తపేట మస్తాన్ వీధికి చెందిన సయ్యద్ నసీమా స్నేహితులు. రంజాన్ పండుగ నేపథ్యంలో రెండు రోజుల కిందట నసీమా హైదరాబాద్‌లోని స్నేహితురాలి వద్దకు వెళ్లి పండుగ షాపింగ్ చేసి తిరిగి ఇంటికి వచ్చారు. అయితే అదే సమయంలో భుసరా, నసీమాలు నడుపుతున్న కార్‌ను స్థానికంగా నివాసం ఉండే షేక్.అన్వర్ తన జీపుతో ఢీ కొట్టాడు. అంతే కాకుండా ఇంటి ముందు నిలిపి ఉంచిన ద్విచక్ర వాహనాలను సైతం ఢీ కొట్టాడు. ఘటనపై భుసరా ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

కౌంటర్ కేసు నమోదు

సయ్యద్ నసీమా, షేక్.ఇమ్రాన్, భుసరాలు తన జీప్‌ను కారుతో ఢీ కొట్టి, కర్రలతో దాడి చేశారని అన్వర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. గురువారం తెల్లవారుజామున నమాజ్ ముగించుకుని ఇంటికి వెళ్లే క్రమంలో ముగ్గురు తన జీప్ అద్దాలు పగలగొట్టి గాయపరిచినట్లు అన్వర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఘటనపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

చేతి వృత్తులపై అవగాహన అవసరం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): మేనేజ్‌మెంట్ స్టడీస్ విభాగ విద్యార్థులు ఆయా స్థానిక చేతి వృత్తులపై అవగాహన పెంచుకోవాలని పొట్టిశ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ శరవణకుమార్ అన్నారు. ఆ కళాశాల మేనేజ్‌మెంట్ స్టడీస్ విభాగం ఆధ్వర్యంలోని 'సంస్కృతి పునరుద్ధరణ' పేరుతో కళంకారి కళపై ఫీల్డ్ స్టడీ కార్యక్రమాన్ని పెడనలో నిర్వహించారు. ఈ సందర్భంగా తొలుత కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ శరవణకుమార్ మాట్లాడుతూ.. విద్యార్థులు తమ తమ స్థానిక ప్రాంతాల్లో ఉన్న వృత్తులు, సంస్కృతులను అర్థం చేసుకొని నూతన వ్యాపార అవకాశాలను అందిపుచ్చుకునేందుకు కృషి చేయాలన్నారు. అలాగే మారుతున్న కాలానుగుణంగా సృజనాత్మకతను పెంపొందించుకొని ఆయా రంగాల్లో ముందుకు సాగితే మంచి విజయాలను సాధించవచ్చని చెప్పారు. అనంతరం కళంకారి కళలో పలువురు ప్రముఖుల అనుభవాలను తెలుసుకున్నారు. విభాగాధిపతి డాక్టర్ ఎస్.మణికంఠ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మంగొల్లు ఉప సర్పంచిగా పద్మావతి



ఉపసర్పంచి పద్మావతిని సత్కరిస్తున్న తన్నీరు నాగేశ్వరరావు, నాయకులు

మంగొల్లు(వత్సవాయి): మండలంలోని మంగొల్లు గ్రామపంచాయతీ ఉప సర్పంచిగా వైఎస్సార్ సీపీకి చెందిన మెట్టిల పద్మావతి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గ్రామపంచాయతీలో మొత్తం 12వార్డులు ఉండగా, వైఎస్సార్ సీపీ తరఫున 8మంది వార్డుసభ్యులుగా గెలిచారు.టీడీపీ తరఫున నలుగురు వార్డు సభ్యులు ఉన్నారు. గతంలో ఉప సర్పంచ్‌గా ఉన్న నలబోతు వెంకటరావు గతేడాది సార్వత్రిక ఎన్నికల అనంతరం టీడీపీ కూటమి అధికారంలోకి రావడంతో వైఎస్సార్ సీపీ నుంచి టీడీపీలో చేరి ఉప సర్పంచి పదవికి రాజీనామా చేశారు. దీంతో ఉప సర్పంచి పదవికి ఎన్నిక అనివార్యమైంది. ఈ క్రమంలో పంచాయతీ కార్యాలయంలో గురువారం ఉపసర్పంచి పదవికి ఎన్నిక జరిగింది. ఈ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ఉప సర్పంచి అభ్యర్థిగా మెట్టిల పద్మావతి నామినేషన్ దాఖలు చేయగా, టీడీపీ తరఫున ఎవ్వరూ బరిలో నిలువలేదు. దీంతో పద్మావతి ఉప సర్పంచిగా ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి ఈవోపీఆర్డీ పి.మాధవి ప్రకటించారు. ఈమేరకు ఎన్నికల అధికారి, పద్మావతికి ధ్రువీకరణ పత్రం అందజేశారు.

మెట్టిల పద్మావతికి ఘనసత్కారం..

ఉప సర్పంచిగా ఏకగ్రీవంగా ఎన్నికైన మెట్టిల పద్మావతిని వైఎస్సార్ సీపీ జగ్గయ్యపేట నియోజకవర్గ ఇన్‌చార్జీ తన్నీరు నాగేశ్వరరావు దుశ్శాలువతో ఘనంగా సత్కరించారు. గ్రామ నాయకులను అభినందించారు. కార్యక్రమంలో గ్రామపార్టీ అధ్యక్షులు బొల్లం కిరణ్, నాయకులు బొల్లం హనుమంతరావు, సింగార వెంకటేశ్వర్లు, గొట్టిపాటి వెంకటేశ్వర్లు, నెల్లూరి రాంబాబు, అన్నెపాక రవీంద్ర, షేక్ సైదులు, మార్కెట్ యార్డు మాజీ డైరెక్టర్ పింగళి నరసింహారెడ్డి పాల్గొన్నారు.

రేపు ఉగాది పురస్కారాలు అందజేత

కంచికచర్ల : వివిధరంగాల్లో కృషి చేసిన పలువురికి ఈనెల 29వతేదీన ఉగాది పురస్కారాలను అందజేయనున్నట్లు బహుజన రచయితల సంఘ ప్రధాన కార్యదర్శి తంగిరాల సోనీ గురువారం తెలిపారు. స్థానిక కేవీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలలో శనివారం ఉదయం పదిగంటలకు నిర్వహించే ఈ కార్యక్రమానికి అందరూ హాజరుకావాలని ఆయన కోరారు.

'నందిగామ బార్' అధ్యక్షునిగా బాబు విద్యాసాగర్



ఎన్నికపత్రం చూపిస్తున్న 'బార్' అధ్యక్షుడు నంద్రు బాబువిద్యాసాగర్



తనను కలిసిన బార్ కార్యదర్శి అద్దంకి మణిబాబును అభినందిస్తున్న మాజీఎమ్మెల్యే జగన్‌మోహన్‌రావు



ఉపాధ్యక్షుడు వరదబోయిన విజయ్‌కుమార్‌ను అభినందిస్తున్న న్యాయవాదులు

నందిగామటౌన్: నందిగామ బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా నంద్రు బాబువిద్యాసాగర్ వరుసగా రెండోసారి ఎన్నికయ్యారు. రెండు దశాబ్దాలకు పైగా బార్ అసోసియేషన్ ఎన్నికలు ఏకగ్రీవంగా ముగుస్తుండగా, 22ఏళ్ల తర్వాత మొదటిసారి బార్ అసోసియేషన్ ఎన్నికల్లో అభ్యర్థులు పోటీకి దిగారు. స్థానిక కోర్టు సముదాయం ఆవరణలో గురువారం నిర్వహించిన ఎన్నికల్లో 153మంది ఓటర్లకుగాను 150మంది తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు.

ఈ ఎన్నికల్లో బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా నంద్రు బాబువిద్యాసాగర్ విజయం సాధించినట్లు ఎన్నికల అధికారి టీవీవీఎస్ శర్మ, అసిస్టెంట్ ఎన్నికల అధికారి వేల్పుల ప్రభాకరరావు తెలిపారు. అధ్యక్షపదవికి పోటీచేసిన బాబువిద్యాసాగర్‌కు 84ఓట్లు రాగా, పాలెపు వెంకటనరసింహారావుకు 66ఓట్లు లభించాయి. దీంతో 18ఓట్ల మెజార్టీతో బాబువిద్యాసాగర్ గెలుపొందారు. ఉపాధ్యక్షుడిగా బొమ్మిశెట్టి ఫణికుమార్‌పై వరదబోయిన విజయకుమార్ గెలుపొందారు. ఫణికుమార్‌కు 47ఓట్లు రాగా, విజయకుమార్‌కు 101ఓట్లు రావడంతో 54ఓట్ల అత్యధిక మెజార్టీ లభించింది. కార్యదర్శిగా అద్దంకి మణిబాబు, చాపల శివరామకృష్ణపై 14ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. మణిబాబుకు 78ఓట్లు రాగా, శివరామకృష్ణకు 64ఓట్లు లభించాయి. సంయుక్త కార్యదర్శి పదవికి పోటీచేసిన ఏడుకొండలుపై ఉప్పులూరి డేవిడ్‌రాజు 12ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. డేవిడ్‌రాజ్‌కు 80ఓట్లు రాగా ఏడుకొండలుకు 68 ఓట్లు పోలయ్యాయని ఎన్నికల అధికారులు తెలిపారు. కోశాధికారి పదవికి పోటీచేసిన మాదుగుల స్టాలిన్‌బాబుకు 74ఓట్లు, గుంజి శ్రీనివాసరావుకు 74ఓట్లు వచ్చాయి. స్టాలిన్ కోశాధికారిగా ఏకగ్రీవంగా ఎన్నికై నట్లు ఎన్నికల అధికారులు వివరించారు. లైబ్రేరియన్‌గా చాట్రగడ్డ రవికుమార్(51ఓట్లు)పై షేక్ అబ్దుల్ కలాం(93 ఓట్లు) ఆజాద్ గెలుపొందారు. స్పోర్ట్స్ అండ్ కల్చరల్ కార్యదర్శిగా గుగులోతు రామారావు, బొద్దు వెంకటేశ్వర్లుపై 39ఓట్ల మెజార్టీతో గెలిచారు. రామారావుకు 94ఓట్లు రాగా, వెంకటేశ్వర్లుకు 55ఓట్లు లభించాయి.

ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులుగా..

ఎగ్జిక్యూటివ్ కమిటీసభ్యులుగా శ్రీచరణ్, దారెల్లి అరుణ్‌కుమార్, వి.కిషోర్, కాంతారావు విజయం సాధించారు. సీనియర్ ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులుగా చావల సాంబశివరావు, వేమూరి సత్యనారాయణమూర్తి, ఎగ్జిక్యూటివ్ కమిటీ మహిళా ప్రతినిధిగా చాపల లక్ష్మీదుర్గ, మహిళా రిప్రజెంటేటివ్‌గా బొద్దు ఈశ్వరమ్మ ఏకగ్రీవంగా ఎన్నికై నట్లు ఎన్నికల అధికారి శర్మ తెలిపారు. ఈ పదవులకు ఒక్కొక్క నామినేషన్ మాత్రమే రావడంతో ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రకటించారు.

అభినందనలు తెలిపిన జగన్‌మోహనరావు..

బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులుగా ఎన్నికైన నంద్రు బాబువిద్యాసాగర్, అద్దంకి మణిబాబు, అసోసియేషన్ నూతన కార్యవర్గ సభ్యులకు నందిగామ మాజీఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు అభినందనలు తెలిపారు.

కళాకారులు సాంస్కృతిక వారధులు



విజయవాడకల్చరల్: కళాకారులు సాంస్కృతిక వారధులని కామ్రేడ్ జీఆర్కే, పోలవరపు సాహితీ సమితి వ్యవస్థాపకుడు గోళ్ల నారాయణరావు అన్నారు. శ్రీ కళాభారతి, పోలవరపు సాహితీ సమితి, తెలుగు కళావాహిని ఆధ్వర్యాన గాంధీనగర్‌లోని ప్రిన్స్ డిజిటల్ మీడియా కార్యాలయంలో గురువారం ప్రపంచ రంగస్థల దినోత్సవం, కళారంగానికి చెందిన పలువురికి సత్కార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గోళ్ల నారాయణరావు మాట్లాడుతూ.. నేడు ప్రపంచ వ్యాప్తంగా రంగస్థల దినోత్సవం నిర్వహిస్తున్నారన్నారు. కళాకారుల జీవితాల్లో వెలుగులు నింపడానికి సాంస్కృతిక సంస్థలు కృషి చేయాలని సూచించారు. శ్రీ కళాభారతి అధ్యక్షుడు శింగంశెట్టి చంద్రశేఖర్ మాట్లాడుతూ నాటక రంగానికి పూర్వవైభవం తీసుకురావాలని యువతను నాటకం రంగం వైపు మళ్లించాలని పిలుపునిచ్చారు. చింతకాయల చిట్టిబాబు పర్యవేక్షణలో కళారంగానికి చెందిన మండ లక్ష్మి, ఎస్ అనిత, పేరం వెంకటేశ్వరరెడ్డి, బి.మల్లేశ్వర పట్నాయక్, శ్యాంప్రసాద్, అమ్ముల ప్రసాద్, డేవిడ్‌రాజులను ఆత్మీయంగా సత్కరించారు.

ఎస్సీ సెల్ రాష్ట్రప్రధాన కార్యదర్శిగా శామ్యూల్



కన్నమాల శామ్యూల్



పెంటి శ్రీనివాసరావు

పెనుగంచిప్రోలు/జగ్గయ్యపేటఅర్బన్: వైఎస్సార్‌సీపీ ఎస్సీసెల్ రాష్ట్ర ప్రధానకార్యదర్శిగా పెనుగంచిప్రోలు మండలం తోటచర్ల గ్రామానికి చెందిన కన్నమాల శామ్యూల్ నియమితులయ్యారు. జగ్గయ్యపేటకు చెందిన మాజీఎంపీపీ పెంటి శ్రీనివాసరావు పార్టీ రాష్ట్ర చేనేత విభాగం అధికారప్రతినిధులుగా నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయంలో ఒక ప్రకటన విడుదల చేసినట్లు వారు తెలిపారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోపాటు తమ నియామకానికి సహకరించిన పార్టీ ఉమ్మడి కృష్ణ-గుంటూరు జిల్లాల కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, జిల్లా అధ్యక్షులు దేవినేని అవినాష్, జగ్గయ్యపేట నియోజకవర్గ ఇన్‌చార్జీ తన్నీరు నాగేశ్వరరావులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

బాధిత రైతులను ఆదుకోవాలి : తన్నీరు

జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలోని తొర్రగుంటపాలెంలో రెండు రోజుల కిందట సాయి తిరుమల కోల్డ్‌స్టోరేజ్ అగ్ని ప్రమాదం ఘటనలో నష్టపోయిన రైతులందరికీ ప్రభుత్వం నష్టపరిహారం అందించాలని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తన్నీరు నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో గురువారం ఆయన మాట్లాడుతూ మార్కెటింగ్ శాఖ పర్యవేక్షణ పూర్తిగా శూన్యంగా ఉందని ఆరోపించారు. ఈ అగ్నిప్రమాదంలో వందలాది మంది రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. ఈ ఘటనకు ఎవరు బాధ్యత వహిస్తారన్నారు. కోల్డ్‌స్టోరేజీ యాజమాన్యమా..రాష్ట్ర ప్రభుత్వమా? అని ప్రశ్నించారు. యాజమాన్యం ఇన్సూరెన్స్ రెన్యూవల్ చేయకపోవడంతో రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారిందన్నారు. ప్రభుత్వ అధికారులు ప్రత్యేక కమిటీని ఏర్పాటుచేసి రైతులకు నష్టపరిహారం అందేలా చూడాలన్నారు. బాధిత రైతులకు మిర్చికి బస్తాకు ఎంత నష్టపరిహారం ఇస్తారనే అంశాన్ని ప్రభుత్వం వెంటనే తేల్చాలని కోరారు. బాధిత రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. రైతులకు ప్రభుత్వం న్యాయం జరిగే వరకు వారి తరపున వైఎస్సార్ సీపీ పోరాడుతుందని స్పష్టం చేశారు.

వైభవంగా నందీశ్వరునికి రుద్రాభిషేకం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పాతబస్తీలోని పురాతన ఆలయమైన పాత శివాలయంలో నందీశ్వరునికి మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాన్ని గురువారం నిర్వహించారు. ఆలయ అర్చకులు స్వామి వారికి విశేష పుష్పాలంకరణ, పంచహారతులు, ప్రత్యేక అభిషేకాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.